
# దుర్వినియోగం

ఆకెళ్ళ రాజ్యలక్ష్మి



**రంగడి** రెండు కళ్ళూ పోయాయి. కావాలని వాడే పోగొట్టుకున్నాడు.

యజమాని జీవితానికి మెరుగులు దిద్దే వెల్డింగు వర్క్‌షాపులోని వెల్డింగు వెలుగు రంగడి రెండు కళ్ళనూ చీకటి చేసింది.

"నా కళ్ళను నేనే పోగొట్టుకున్నాను. నేను చదువుకోవాలి. అందుకే నేను కళ్ళు పోగొట్టుకున్నాను. అందుకే నా కళ్ళను నేను బాగుచేయించుకోను. అందుకే నేను మళ్ళీ చూపు తెప్పించుకోను"—రంగడు తన తోటి కార్మిక కుర్రవాళ్ళకు గట్టిగా చెప్పాడు.

వర్క్‌షాపుల్లో, టీ బంకుల్లో పని చేసే కుర్రవాళ్ళు రంగడికి జరిగిన ఘోరానికి కంట తడి పెట్టారు. చందాలు వేసుకొని రంగడి కళ్ళు బాగుచేయిస్తామని వాళ్ళంతా పట్టుబట్టారు. కాని రంగడు అందుకు అంగీకరించలేదు. గుడ్డివాడుగానే ఉండిపోవా లనుకున్నాడు.

కళ్ళు పోవటానికీ, చదువుకోవటానికీ సంబంధ మేమిటో ఆ కుర్రవాళ్ళకు అర్థం కాలేదు. రంగడి కళ్ళు బాగుచేయించే ప్రయత్నం వాళ్ళు మానుకున్నారు.

కళ్ళు పోగొట్టుకొని ఇంటికొచ్చిన రంగడి మీద తండ్రి కొండయ్య మండిపడ్డాడు. పనిలో అజాగ్రత్తగా ఉండి కళ్ళు పోగొట్టుకున్నాడని నాలుగు బాదాడు. రోజూ కళ్ళ జూస్తున్న నాలుగు డబ్బులు మట్టిగొట్టుకుపోయాయని సవతితల్లి నానా తిట్లూ తిట్టింది.

తండ్రి కొట్టినా, తల్లి తిట్టినా రంగడు బాధపడలేదు. వాడి కళ్ళను వాడు పోగొట్టుకోవడంలో చాలా మంచిపని చేసినట్టు సంతోషించాడు. చదువుకునేందుకు చక్కని రహదారి ఏర్పరుచుకున్నట్టు ఆనందించాడు.

రంగడికి అయిదు సంవత్సరాల వయసు రాగానే కొండయ్య వాడిని బడికి తోలేశాడు. వాడు చదువుకొని బాగుపడాలని కాదు. కొంపలో అల్లరి లేకుండా ఉంటుందని.

రంగడికి బడి వాతావరణం చాలా నచ్చింది. పాలుగారే ప్రాయంలో చదువు బాగా రుచించింది.

రంగడికి ఎనిమిదేళ్ళు వచ్చాయి. ఆ చిన్నారి చేతులు రాయటం నేర్చుకున్నాయి. ఆ పొన్నారి మేథ చదవటం అలవరచుకుంది.

"ఇంక నువ్వు బడికి పోవడానికిలేదు."

"ఏం?"

"చదివిన వరకూ చాలు!"

"నేను ఇంకా చదువుకుంటాను."

"చదివి ఏం చేస్తావోయ్, ఉద్యోగం కోసం ఊళ్ళు పట్టుకొని ఊరేగుతావా? ఇదిగో చెప్తున్నా, నాలుగు మెతుకులు గతకాలా అంటే ఇప్పటి నుంచి ఏదో ఒక పని చేసుకోవలసిందే."

ఆ రాత్రి ఆ పూరికొంపలో కొండయ్యకూ, రంగడికీ—ఈ విధంగా సంభాషణ జరిగింది.

రంగడు మరునాటి నుంచి బడికి పోకూడదు. ఏదో ఒక పని చేసి నాలుగు డబ్బులు సంపాదించి కుటుంబాన్ని ఆదుకోవాలి. కొండయ్య తీసుకున్న ఈ కఠోర నిర్ణయం రంగడి ఆశయాన్ని శాశ్వతంగా సమాధి చేసింది.

రంగడు ఆ రాత్రంతా రోదించాడు. వాడి రోదన ఏ బడి పంతులుకూ వినిపించలేదు. ఏ స్వచ్ఛంద సంస్థ చెవినీ తాకలేదు. నిద్రిస్తున్న చట్టం కర్ణపుటాలనూ ముట్టలేదు. కాని నిర్బంధోచిత ప్రాథమిక విద్యా విధానం కోసం తీవ్రంగా గాలించింది. దాని జాడ ఎక్కడా కానరాలేదు.

తెల్లారీ తెల్లారకముందే రంగణ్ణి కాలితో తట్టి లేపాడు కొండయ్య. ఆ పసివాడి జీవనాడిని పాతాళానికి దిగజారుస్తున్న దారులా అన్నట్టు రంగడి పాలబుగ్గలమీద కన్నీటి చారలు కనుపించాయి.

రంగడిని ఒక వెల్డింగ్ వర్క్‌షాపులో చేర్పాడు కొండయ్య. బుద్ధిగా పని చెయ్యమని చెప్పాడు.

ఎదిగీ ఎదగని వయసులో బ్రతుకుభారం రంగడి నెత్తిన పడింది. దుర్భర జీవనయాత్ర ఆరంభమైంది. ఆ చిట్టిచేతులు చదువుకు స్వస్తి చెప్పి శ్రమకు అంకితమయ్యాయి. ఆ భావిపౌరుడు బాల కార్మికు డయ్యాడు.

'పని చేసుకొని బ్రతకవలసిన దుస్థితి నుంచి పసివాళ్ళను కాపాడే వారే లేరా? బడికి పంపకుండా ఇలా పసివాళ్ళను పనికి పంపి చంపుతున్న దుర్మార్గు లెవరు? అని అడిగే దిక్కేలేదా?' రంగడి ఎదిగే హృదయంలో అనుకోకుండా అంకురించింది ఆక్రోశం.

రోజూ ఉదయం ఎనిమిదికి వర్క్‌షాపుకు హాజరు కావాలి. కొట్టు ఊడ్చాలి. వెల్డింగ్ మిషను తుడవాలి. కొట్టులో ఉన్న కమ్ములు బయట పడెయ్యాలి. కొలతల ప్రకారం కమ్ములు తెగగొట్టి ముక్కలు చెయ్యాలి. వెల్డింగు చేసేప్పుడు దగ్గరుండి ఇనుపముక్కలు అందించాలి.

రెక్కలు విరిగే పని. ఆ పనికి కాలపరిమితి లేదు. తిండి తినటం, ఇంటికి పోవటం యజమాని దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఉంటుంది.

పని చేసే పిల్లవాడికి ఎన్ని సంవత్సరాలుంటే అన్ని రూపాయలు కూలి. ఆ లెక్కన రంగడి కూలి రోజుకు ఎనిమిది రూపాయలు.

పని ఎక్కువ. కూలి తక్కువ. అన్యాయంగా పిల్లల శ్రమను దోచేస్తున్నారు. బాల కార్మికుల కష్టాలు ఆలకించే వారే లేరు. వారి సమస్యలు పరిష్కరించేందుకు వారికి సంఘాలు లేవు.

రంగడి శరీరం వర్క్‌షాపులో చెక్కలు ముక్కలవుతున్నా మనసు బడిలో చదువును గూర్చి ఆలోచిస్తూ ఉండేది. 'చదువుకోవాలి' అన్న ధ్యేయం వాడిని వెంటాడుతూ ఉండేది.

ఎంత పొద్దుపోయినా సరే రాత్రి ఇంటికి పోతూ వాడి సంపాదనలో రంగడు ఒక సారా పైసా తీసుకుపోయి తండ్రి కివ్వాలి. మిగతా డబ్బులు సవతి తల్లికి సమర్పించాలి. రంగడు పనిలో చేరిన మరురోజు తండ్రి జారీ చేసిన హుకుం ఇది.

రంగడి వర్క్‌షాపు నాలుగు కిలోమీటర్ల దూరాన ఉంది. ఉదయాన లేవగానే ఇల్లంతా చిమ్మి, కుండలకు నీళ్ళు పోసి, సవతితల్లి ఇంకేదైనా పని చెబితే అదీ పూర్తి చేసి, ఎనిమిదికంతా వర్క్‌షాపులో ఉండాలి. టౌన్ బస్సులో వెళ్ళేందుకు చార్జి అడిగితే వీపు బద్దలు కొడుతుంది సవతితల్లి.

"ఇంకెప్పుడూ ఆలస్యంగా రాను బాబూ! ఈసారికి క్షమించండి" వినయంగా చెప్పుకున్నాడు రంగడు.

ఇంట్లో పని ఎక్కువ కావటంతో ఆ రోజు వర్క్‌షాపుకు రావటం ఆలస్యమైంది. పరిగెత్తి వచ్చినా అందుకోలేకపోయాడు.

"పోరా గాడిదా! పో! ఇది పనా మజాకా! నీ, ఇష్టమొచ్చినప్పుడు దర్జాగా రావడానికి?" గట్టిగా అరిచాడు యజమాని.

కాళ్ళా వేళ్ళా బడి ఏడవటంతో సగం కూలిమీద ఆ రోజు పని చేసేందుకు ఒప్పుకున్నాడు యజమాని.

కూలి తక్కువ తీసుకుపోయినందుకు ఆ రాత్రి రంగడి శరీరంమీద సవతితల్లి చేతులూ, కాళ్ళూ కదంతొక్కాయి.

వర్క్‌షాపు ఎదురుగా కొంత దూరంలో రోజూ కాన్వెంటు బస్సుకోసం పిల్లలు గుమిగూడి ఉంటారు. అంతా రంగడి వయసువాళ్ళే. వాళ్ళను చూసి రంగడు ఆలోచనలో మునిగిపోయేవాడు. వాళ్ళలా యూనిఫారం వేసుకొని, పుస్తకాలు పట్టుకొని, ఉత్సాహంగా బడికి పోతే ఎంత బాగుంటుంది—అనుకునేవాడు. కాన్వెంటు కుర్రవాళ్ళ ఊహాలోకంలో ఆశాసౌధాలు నిర్మించుకుంటూ ఒక్కోసారి చేస్తున్న పని మరిచిపోయేవాడు. ఇనుప కమ్మీతో యజమాని తలమీద కొట్టిన దెబ్బతో రంగడు మళ్ళీ ఈ లోకంలోకి వచ్చేవాడు.

రంగడు ఉన్న పక్క వీధిలో వయోజన విద్యా కేంద్రంలో రాత్రిపూట పెద్ద వారికి చదువు చెప్తుంటారు. అక్కడైనా చదువుకుందామన్న ఆశ తీరని ఆశగానే నిలిచిపోయింది. రాత్రి కొంప చేరేప్పటికి పదవుతుంది. రాగానే సవతితల్లి కాళ్ళు వత్తాలి. ఏది తప్పినా ఈ పని తప్పదు.

చదువుకోవాలన్న తన కోరికను నాశనం చేసి నిశ్చింతగా గురక పెడ్తూ నిద్రపోయే తల్లిదండ్రులు కిరాతకుల్లా కనిపించారు. వాళ్ళ గొంతు నులిమి చంపాలన్నంత క్రూరరూపం దాల్చేది రంగడి కోపం.

రెండు రోజుల నుంచీ రంగడు ఇంటికి రాలేదు. మూడో రోజు ఉదయం వర్క్‌షాపుకు వెళ్ళాడు కొండయ్య. రంగడు ఇంటికి రాలేదన్న బాధతో కాదు. రెండు రోజుల నుంచి కూలి డబ్బులు ఇల్లు చేరనందుకు, రెండు రాత్రుల నుంచి సారా పైసా నోటికి అందనందుకు.

వర్క్‌షాపుకు కూడా రెండు రోజుల నుంచీ రావటంలేదని చెప్పారు. నేరుగా బడి దగ్గరకు పోయాడు కొండయ్య.

మాస్టారు చెప్తున్న పాఠం వింటున్నాడు రంగడు. ఉగ్రుడైపోయాడు కొండయ్య. క్లాసులోకి దూరి జుట్టు పట్టుకొని రంగడిని బరబరా బయటకు ఈడ్చుకొచ్చాడు. శివమెత్తినట్టు తన్నాడు, కొట్టాడు. రంగడు కేకలు పెట్టాడు. మాస్టారు అడ్డుపడ్డాడు.

"చదువుకోవాలన్న ఆశ రంగడిలో ఎక్కువగా ఉంది. మా ఇంట్లో అన్నం పెట్టి వాడిని నేను చదివిస్తాను కొండయ్యా!" సలహాగా చెప్పాడు మాస్టారు.

"మరి మా ఇంటి సంగతేమిటి బాబూ?" అన్నాడు కొండయ్య.

"నువ్వు సంపాదిస్తున్నావుగా చాలదూ?" అన్నాడు మాస్టారు.

"చాలితే ఈ పిల్లకుంకచేత పనెందుకు చేయిస్తాను బాబూ?" అంటూ రంగణ్ణి ఈడ్చుకుపోయి, వర్క్‌షాపు యజమానిని బ్రతిమాలి మళ్ళీ పనిలో పడేశాడు కొండయ్య.

రంగడు మొండికేశాడు. మాస్టారు దండంపెట్టి చెప్పాడు. కొండయ్య నిర్ణయంలో మార్పు లేదు.

మెకానిక్ వరండాకు గ్రిల్సు తయారు చేస్తున్నాడు. ఇనుపముక్కలను వెల్డింగు చేసి అతుకుతున్నాడు. పక్కనే కూర్చుని రంగడు మెకానిక్కుకు సహాయంగా ఉన్నాడు.

వెల్డింగు జోరుగా జరుగుతూ ఉంది. "చర్ర్" మంటూ నిప్పురవ్వలు ఎగురుతున్నాయి. కళ్ళను చెదరగొడుతూ వెల్డింగు కాంతిమెరుపులా మెరుస్తూ ఉంది.

రంగడి హృదయం నిండా దిగులు, తాను చదువుకోలేకపోయినందుకు.

రంగడి తలనిండా ఆలోచనలు, తాను చదువుకోవటం ఎలా అని.

రంగడి లేత కళ్ళనిండా చురుకైన చూపులు, చదువుకునేందుకు దారులు వెతుకుతూ.

ఊరు వదిలి దూరంగా పారిపోదామనుకున్నాడు. ఎంత దూరం పోయినా గాలించి పట్టుకొచ్చి మళ్ళీ పనిలో పడేస్తాడు తండ్రి. ఈ ప్రయత్నం లాభంలే దనుకున్నాడు రంగడు.

కొంత సేపు వెల్డింగు ఆగి, మళ్ళీ ప్రారంభమైంది. నిప్పురవ్వలు చెరుగుతూ ఉంది. వెలుగును తీవ్రంగా వెదజల్లుతూ ఉంది.

ఉన్నట్టుండి కెవ్వున కేక వేశాడు రంగడు. బాధ భరించలేక రెండు చేతులతో కళ్ళు అదిమి పట్టుకున్నాడు.

వెల్డింగు ఆగిపోయింది. అంతా రంగడి చుట్టూ గుమిగూడారు.

కొందరు ఆశ్చర్యపోయారు. కొందరు 'అయ్యో పాప'మన్నారు.

'పనిదొంగ. ఇలాగైనా ఇంట్లో కూర్చుని సోమరిపోతులా తిండి తినొచ్చన్నారు మరి కొందరు.

"నేను చదువుకోవాలి. అందుకే నా కళ్ళను పొగొట్టుకున్నాను" సమాధానంగా చెప్పాడు రంగడు.

రంగడు ఒకసారి సినిమాకు వెళ్ళాడు. అంధులకోసం ప్రత్యేకంగా పాఠశాలలు ఉండటం, అంధులు అందులో చదువుకోవటం; అన్ని రంగాలలో వాళ్ళు అభివృద్ధికి రావటం డాక్యుమెంటరీ చిత్రంలో చూశాడు.

తాను అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్నంతకాలం తనకు చదువుకునే యోగం కలగదు. తల్లిదండ్రులు తనను పనికి తప్ప బడికి పంపరు. చదువుకునేందుకు తనకు మిగిలిన మార్గం ఇదొక్కటే ననుకున్నాడు. తన జీవితాశయం సాధించడం కోసం రెండు కళ్ళూ పొగొట్టుకున్నాడు. అంధుల పాఠకాలలో హాయిగా చదువుకోవచ్చు నన్న ఆనందంతో పొంగిపోయాడు రంగడు.

తన చివరి ప్రయత్నం తలకిందులవుతుందని ఊహించలేదు రంగడు. గుడ్డివాడైన రంగడిని వాడి తల్లిదండ్రులు దూరంగా నెట్టేయలేదు. వాడి గుడ్డితనాన్ని వాళ్ళు డబ్బుగా మార్చుకున్నారు. రూపాంతరం చెందిన వాడి కళ్ళు మరో రూపంలో డబ్బు సంపాదనకు ఉపయోగించుకున్నారు.

రంగణ్ణి ఉదయాన్నే తీసుకుపోయి రోజు కొక చోట—బస్సుస్టాండులోనే, హోటళ్ళ దగ్గరనే, దేవాలయాల దగ్గరో గుడ్డపరిచి కూర్చోబెడుతున్నాడు కొండయ్య. సాయంకాలం ఇంటికి తీసుకుపోతున్నాడు.

రంగడి సంపాదనతో కొండయ్య రోజూ సారా పైసా కొనటం జరుగుతూనే ఉంది. కొరవ డబ్బు సవతితల్లి చేతికి చేరుతూనే ఉంది.

కాని—

ముందు ముందు దేశాభివృద్ధికి పనికొచ్చే పిల్లల శక్తిసామర్థ్యాలను దుర్వినియోగపరుస్తున్నామన్న ఆలోచన ఏ ఒక్క నిముషంలోనూ ఆ తల్లిదండ్రులలో కలగటంలేదు.

"బాబూ! గుడ్డివాణ్ణి బాబూ! ధర్మం చెయ్యండి బాబూ!"

ఈ పాఠాన్ని ఈ అంధకార ప్రపంచ పాఠశాలలో ఉదయం నుంచి సాయంకాలం వరకూ వల్లెవేస్తున్నాడు రంగడు.

చివరకు వాడికి దక్కిన చదువు అదే! ●

---

"ఎలివేటర్‌లో నా నూరు రూపాయల నోటు పోయింది. ఎవరికైనా దొరికితే దయచేసి అపార్ట్‌మెంటు 318లో నివసించే మిస్ కార్టర్‌కు ఇవ్వండి" అన్న ఒక ప్రకటన హెంద్రీ-ఇ-లిబోర్ చూశాడు. మిస్ కార్టర్ వృద్ధురాలు. ఆమెకు ఎవరూ లేరు. ఇది లిబోర్‌కు తెలుసు. ఆమె అపార్ట్‌మెంటుకు వెళ్ళి తలుపు తట్టాడు. ఆమె బయటకు వచ్చింది. ఆమెను చూడగానే రూపాయలు దొరికినట్టుగా గుర్తించాడు. ఆమెను అదే విషయం అడిగాడు. అప్పు డామె ఇలా అందిట. 'థాంక్స్. దొరికాయ్. రెండవ అంతస్థులోని మిస్టర్ డేవిస్ తనకు దొరికిందని తెచ్చి ఇచ్చాడు. ఆ తర్వాత మిస్టర్ హార్వే శ్రీమతి వెస్టర్‌లు కూడా తమకు దొరికాయని తెచ్చి ఇచ్చారు. వారికంటే ముందే నేను నా కోటు జేబులో నూర్రూపాయల నోటుండం చూశాను. మీకూ దొరికిందా? దయచేసి పైకి వెళ్ళేటప్పుడు ఆ నోటీసును తీసేయండి' అని.

- చాగాపురం నాగేశ్వరరావు